ఐరావతమ్మ

కొండల్రావుకు చచ్చే చావుగా వుంది. ఎక్కే గడప దిగేగడప క్షణం తీరిక లేకపోవడంతో అతనికి అయాసం వస్తూవుంది. హనుమంతుడు సంజీవి కోసం వెతికినట్లు కొండల్రావు గదికోసం టౌనంతా గాలించి వేస్తున్నాడు. మధ్యాహ్నమయింది కాని ఎక్కడా అతనికి చిన్నగది దొరకలేదు. కొండల్రావు యుక్తిపరుడు. అంతటి యుక్తిపరుడి ఆటలూ ఇక్కడ సాగడంలేదు.

'ఇదే ఆఖరు. ఇక ఈ పూటకు యిళ్ళ వేట అపుదాం' అనుకొంటూ 'కె. గోవిందయ్య, లాండులార్డు' అని నేమ్ ప్లేటున్న కాంపౌండు గేటు తీసుకొని లోపలికి అడుగుపెట్టాడు. ఇంటిముందు చిన్న పూలతోట వుంది. పూలచెట్ల మధ్యగా లోపలికి సన్నని దారి వుంది.

కొండల్రావు ముందుకు నడిచి వరండాలో కుర్చీలో కూర్చొని పేపరు చదువుతున్న నడివయస్కుడికి "నమస్కారమండీ" అంటూ రెండు చేతులెత్తి నమస్కారం చేసాడు. ఆయన చీపురు పుల్లలా వున్న కొండల్రావును ఎగాదిగా చూసి ఫక్కున నవ్వాడు. తరువాత 'కూర్చో' అన్నట్లు ఎదురుగా కుర్చీపైపు చేయి చూపించాడు. ఆ నడివయస్కుడు తనను చూసి ఎందుకు నవ్వినా గదిస్తే చాలనుకొంటూ కుర్చీలో కూర్చున్నాడు.

మధ్య వయస్కుడు పేపరు మడచి ప్రక్కనపెట్టి, కళ్ళద్దాలను తీసి పంచె అంచులతో తుడుస్తూ "ఐరా!" అంటూ పెద్దగా అరచాడు. కొండల్రావు బిత్తరపోయ్యాడు. 'అరె! ఈ జంతువు పేరు నేను ఎప్పుడూ వినలేదే' అనుకొన్నాడు. ఒకవేళ తను అతన్ని మధ్యలో డిస్టర్బ్ చేసాడని తన పెంపుడు కుక్కచేత కరిపిస్తాడేమోనని భయపడి కాళ్ళు రెండూ పైకి లాక్కొని కుర్చీలో పెట్టుకున్నాడు. వేదాంతిలా నవ్వాడు మధ్య వయస్కుడు.

ఒక నిముషం తర్వాత వెనకనుంచి పెద్దగా ఉచ్ఛ్వాసనిస్వాసలు వినిపించడంతో తిరిగి చూసాడు. అంతే, భయంతో లేచి నిలబడి గడ్డిపోచలా వణికిపోసాగాడు కొండల్రావు.

మధ్యవయస్కుడు చిరునవ్వు నవ్వి, "భయపడకోయ్ బలవంతరావ్! ఈ గోవిందయ్య అర్ధాంగి ఆమె. నమస్కారం చెయ్ నువ్వు అనుకొన్నపని అవుతుంది" అన్నాడు.

గోవిందయ్య ఇంతకు పూర్వం తనను చూసి నవ్విన నవ్వుకు ఇప్పుడు అర్థం తెలిసింది కొండల్రావుకు.

"నాపేరు బలవంతరావు కాదండి. కొండల్రావు" అన్నాడు.

ఎదురుగా ఓ భీకరమైన ఆకారం నిలబడి వుంది. ఆమె స్త్రీ అని కట్టు బొట్టు తీరు తెలుపుతూవుంది. అయితే ఆకారం గున్న ఏనుగులావుంది. పైనుంచి క్రింది వరకూ ఒకే సైజుతో నెట్టుకొచ్చి నిలబెట్టిన సారాపీపాలావుంది. ఆమె ఒక్కో చేయి కొండల్రావు ఛాతీకి రెండు రెట్లు లావుంటుంది. తల చిన్నదిగా పీపామీద బోర్లించిన చెంబులావుంది. ఆమె శరీరం కాయనలుపు ముఖం కాఠిన్యంగా వుంది. ఆమెకు కొండల్రావును చూస్తే ఈర్ష్యగా వుంది. కొండల్రావుకు ఆమెను చూస్తే భయంగా వుంది.

గదివద్దు బాబో? వెళ్ళిపోదాం అనుకునేంతలో ఆమె పక్కనేవున్న బెంచీ మీద కూర్చొంది. కొండల్రావు ఇంతకుముందు కూర్చొన్న కుర్చీలో రెండుకాళ్లు వుంచింది.

"ఏంకావాలి?" ముఖంలో కనిపించే కాఠిన్యత కంఠంలోలేదు.

"ఏమీ అక్కర్లేదండి" వెనక్కు తిరగబోయాడు కొండల్రావు.

"అదేమిటోయ్! రూముకావాలన్నావ్, వెళ్ళిపోతున్నావ్. అమ్మగారికి చెప్పుకో నీ పరిస్థితి" అన్నాడు, ఇంటి ఓనరు గోవిందయ్య.

కుదుటబడ్డ మనసుతో "అమ్మా! నేను గాంధీనగర్ బట్టల కొట్టులో గుమాస్తాగా పనిచేస్తున్నాను. ఒంటరివాణ్ని. తమరింట్లో ఏదైనా గది అద్దెకిస్తారేమోనని" నసిగాడు.

"అద్దె ఎంత ఇవ్వగలవ్" అంది ఆమె జబర్దస్తీగా.

"ఓ పాతిక అయితే ఇవ్వగలనండి"

"గది వందరూపాయలు చెప్పినా కళ్ళకద్దుకొని తీసుకొనేవాళ్ళు బోలెడుమంది న్నారు. పాతికకు గదేం వస్తుంది"

"నా జీతమే మూడువందలండి"

"అయితే గది దొరకదు అబ్బాయ్"

'ఈమాత్రం దానికి ఇంత ఇంటర్వ్యూ దేనికో' అనుకొంటూ మెట్లుదిగాడు భార్యాభర్తలిద్దరూ ఏదో మాట్లానుకొంటున్నారు.

కొండల్రావు కాంపౌండు గేటు దగ్గరకు వచ్చేసరికి "అబ్బాయ్" అంటూ పిలిచింది ఐరావతమ్మ.

వెనక్కు తిరిగాడు కొండల్రావు.

'ఏ పుట్టలో ఏపాముందో' అంటున్నాడు గోవిందయ్య.

కొండల్రావు వాళ్ళదగ్గరకు నడిచాడు.

"మీదేవూరు నాయనా" అనడిగింది ఐరావతమ్మ.

తన ఊరి పేరు, తన ఫామిలీని తీసుకురాలేకపోవడానికి గల కారణాలను వివరించాడు.

"అబ్బాయ్ నాకథ పూర్తిగా విని ఏదైనా పరిష్కారం దొరికితే చెప్పు నేను పెళ్ళయ్యేంతవరకు సన్నగా, చలాకీగా వుండేదాన్ని. కాని పెళ్ళయిన మరుసంవత్సరం నుంచి. ఇంతింతై వటుడింతై అన్నట్లు ఇలా ఊరిపోయాను నాయనా. పెళ్ళప్పుడు మా అయన్ను, నన్ను చూసిన అమ్మలక్కలంతా మీ ఆయనేమో చింతమానులా వున్నాడు, నువ్వేమో గడకర్రలా వున్నావు అనేవారు. కాని ఇప్పుడు మా పరిస్థితి దానికి వ్యతిరేకమయింది. కూర్చుంటే లేవలేను. లేస్తే కూర్చేలేను....అమ్మా.... అబ్బా....ఉస్...." అంటూ ఆయాసం తీర్చుకోసాగింది ఐరావతమ్మ. ఆమె ఈ మధ్యకాలంలో ఎప్పుడూ అంతసేపు కంటిన్యూగా మాట్లాడలేదు పాపం.

గోవిందయ్య అందుకొన్నాడు "....బాబూ! నేను ఒకప్పుడు లాండ్ లార్డునే. పెళ్ళానికి వైద్యం చేయించాలనే నెపంతో టౌనులో స్థిరపడి లాండ్ అంతా పోగొట్టు కొని లాండులేని లార్డునయ్యాను. ఇంత ఖర్చుపెట్టినా ఫలితం ఏ మాత్రమూ కని పించలేదు. ఇప్పుడు నా సమస్య అల్లా నా భార్య గురించే. ఒక సినిమా లేదు, ఒక షికారులేదు పాపం. మొన్నటికిమొన్న శివరాత్రికి గుడికి పోవాలంటే ఒక్క రిక్షా వాడూ ఎక్కించుకోలా. టాక్సీలోనా పట్టదు. నడిచిపోదామంటే అరమైలు దూరం ఆరుగంటలసేపు నడుస్తుంది, అందుకే ఏంచేసామంటావ్" ప్రశ్నార్థకంగా ఆగాడు గోవిందయ్య.

'మీరే చెప్పండ'న్నట్లు గోవిందయ్య వైపు చూశాడు కొండ్రలావు.

"అప్పుడేంచేసామో తెలుసా వీధిలో కూరగాయలు అమ్మే నాలుగు చక్రాల బండీ తెప్పించి, దానిమీద కూర్చోబెట్టి నెట్టుకు వెళ్లాం. ఇలావుంది మా పరిస్థితి లావు తగ్గటానికి చెట్లకు నీళ్ళు తనే తోడిపోస్తుంది ఇంట్లో పనంతా చేస్తుంది. ఎక్కువ పనిచేస్తే గుండెనొప్పి వస్తుందేగాని లావు తగ్గడంలేదు...."

"....కనుక నాయనా నీ ఎరికలో ఎవరయినా ఈ జబ్బుకు వైద్యం చేయగల వ్యక్తి ఎవరయినా వుంటే చెప్పు బాబూ! నీకు పుణ్యం వుంటుంది" రెండు చేతు లెత్తి ప్రార్థిస్తూ అంది ఐరావతమ్మ.

కొండ్రలావు మెదడులో ఒక స్పార్క్ మెరిసింది. పేషెంట్లులేక గోళ్లు కొరుక్కుంటూ మంచినీళ్ళు త్రాగి కాలం గడుపుతున్న ఆర్.ఎం.పీ డాక్టరు అప్పారావు గుర్తుకొచ్చాడు. ఇప్పుడు ఈ కేసు అతనికి పట్టిస్తే వాడి నోట్లోకి కూడుపోతుంది. తనకూ ఉండటానికి ఇక్కడ గూడు దొరుకుతుంది అనుకొన్నాడు.

"అమ్మమ్మా.... అమోఘంగా సెలవిచ్చారండి. నన్ను నేను తిట్టుకోవాలండి. ఎందుకంటారేమో ఈ విషయంమీద మీరడిగేంత వరకు నేను చెప్పలేదు అందుకని. నా స్నేహితుడొకడున్నాడమ్మగారూ! పేరు అప్పారావు. బ్రహ్మాండమైన వైద్యుడు. ఉదయగిరి కొండల్లోంచి తెచ్చిన వనమూలికలతో అద్భుతమైన మందు తయారు చేస్తాడు. గుర్తింపులేక అలా వుండిపోయాడుగాని, ఎవరైనా ప్రోత్సాహమిస్తే అతన్ని మించినవాడు. ఉండడు లావు వాళ్ళని సన్నగా చేయడంలో ఎక్స్‌పర్టు. మీ వ్యాధి నయంచేయగలవాడు అతనొక్కడే. ఇక నేను వెళ్తాను. ఎప్పుడు రమ్మంటారో చెప్పండి. అప్పుడే నేను వచ్చి స్వయంగా అక్కడకు తీసుకువెళ్తాను" తన వాక్చా తుర్యాన్ని బయటపెట్టాడు కొండ్రలావు.

'నేచెప్పలా' అంటే 'నేచెప్పలా' అంటూ ఒకరికొకరు వాదించుకొన్నారు. తరవాత "కూర్చోనాయనా" అంటూ కుర్చీ చూపించింది.

'దారిలో పడుతున్నారు దంపతులు' అనుకొంటూ నక్కలా ముడుచుకొని కుర్చీలో కూర్చున్నాడు కొండ్రలావు.

"నాయనా కొండ్రలావూ! చీకట్లో చిరుదివ్వెలా దొరికావు మాకు. నన్ను నీవే కాపాడాలి. మా ఇంట్లోనే ఓ గదిలోవుండు. అద్దెన్నకూడా ఇవ్వనక్కరలేదు.

నా జబ్బు నయం చేయించి నేను సన్నబడేలా చేయి చాలు. నా ఆస్తంతా వదులు కోవడానికైనా సిద్ధంగా వున్నాను" అంది ఆవేశంగా ఐరావతమ్మ.

"అమ్మమ్మా! అంతమాటనకండి. మీరంత ఖర్చుపెట్టాల్సిన అవసరంలేదు. వాడు నా ఫ్రెండే. జబ్బు నయమయింతర్వాతనే డబ్బు ఇస్తురుగాని" అన్నాడు కొండబ్రాలావు వినయం కనబరుస్తూ.

"నువ్వు ఎట్లాచెబితే అట్టా నడుచుకుంటాను. సాయంత్రమే వచ్చి గదిలో చేరు" ఆప్యాయంగా అంది ఐరావతమ్మ. గోవిందయ్య నిర్వికారంగా నవ్వాడు.

ఆరోజు సాయంత్రమే వరండాకు కుడిపైపుగా నున్న గదిలో చేరాడు. మంచి రోజు చూసి డాక్టరు దగ్గరకు వెళ్లామని ఐరావతమ్మ అనడంతో కొండబ్రాలావు తొందర పడలేదు. అలాగే అంటూ తన మిత్రుడి దగ్గరకు వెళ్ళి విషయమంతా చెప్పాడు.

"ఒరే ఆమె లావు తగ్గించడం నావల్లకాదు. నాకు ఆ డబ్బులు అక్కర్లేదు" నిరాశగా తల వ్రేలాడేసాడు అప్పారావు.

"ఓరి అమాయకుడా! డాక్టరు ఎక్కడైనా నేను జబ్బు నయంచేయలేనని ఒప్పుకుంటాడట్రా. నయమవుతుందని చెప్పి డబ్బు గుంజాలిగాని. ఇక పేషంట్లకు నమ్మకం లేకపోతే వాళ్ళే వేరే డాక్టరును చూసుకుంటారు."

"అయామ్ సారీరా! నిజాయితీగా నీళ్ళు త్రాగి బ్రతుకుతానుగాని మోసంచేసి పంచభక్ష్య పరమాన్నాలు తినను" నడుందగ్గర పాంటు చిరుగును కప్పెడుతూ షర్టు క్రిందికి లాక్కొన్నాడు.

"ఒరే నువ్వు కాదంటే రేపు ఉదయమే నన్ను ఫుట్‌బాల్‌ని తన్నినట్లు నన్ను వీధిలోకి తన్నేస్తుంది అక్కడ నేను క్షేమంగా వుండాలంటే నీవీ సహాయం చేయక తప్పదు" రెండు చేతులు పట్టుకొంటూ అడిగాడు. చివరకు ఎలాగో ఒప్పుకొన్నాడు అప్పారావు.

ఐరావతమ్మను ఒకరోజు డాక్టరు దగ్గరకు తీసుకువెళ్ళాడు. అప్పారావు ఏవేవో పరీక్షలుచేసి, వనమూలికలతో ప్రసిద్ధమైన మందు తయారు చేయాలని, పదిరోజులలో మందు తయారుచేసి కొండబ్రాలావుచేత పంపిస్తానని చెప్పాడు. ఎప్పటిలాగే చెట్లకు

నీళ్ళు పోయడం, చెట్లు త్రవ్వడం మొదలయిన పనులు చేయాలని చెప్పాడు. అప్పారావు వద్దంటున్నా కొంత డబ్బు అతని చేతిలో పెట్టింది. ఐరావతమ్మ. ఆమె ఆత్మీయత ఆమెది మరి.

రోజులు గడుస్తున్నాయి కాని ఐరావతమ్మలో ఏ మార్పూ రావడంలేదు ఉదయాన్నే బావినుండి నీళ్ళులాగి బిందెతో మోసుకెళ్ళి చెట్లకు పోస్తుంది. అంత పెద్ద బిందె ఆమె చేతిలో చిన్న చెంబులా కనిపిస్తుంది. ఇంట్లో పనులన్నీ తనపైన వేసుకొని చేస్తుంది. అయినా రోజు రోజుకూ ఆమె లావవుతుందేగాని, సన్నబడడంలేదు.

ఆరునెలలు గడిచింతర్వాత ఒకరోజు "కొండల్రావ్! లాభంలేదోయ్! మీ అప్పారావు మందు లావు తగ్గించడానికి బదులు లావెక్కిస్తుందోయ్! యింకో డాక్టరును చూడు" అంది.

కొండల్రావు రకరకాల డాక్టర్లను మారుస్తూ వున్నాడు. ఆమెకు విసుగు వచ్చినప్పుడు ఊరడిస్తున్నాడు. ఆమెలో ఆశను పెంపొందింపజేస్తూ ఎన్నో ఉదాహరణలు చెబుతున్నాడు. గోవిందయ్య ఇవేమీ పట్టించుకోవడం లేదు చూస్తుండడం తప్ప. ఇప్పుడు కొండల్రావు గది అద్దె కట్టకపోగా, భోజనంకూడా ఉచితంగా ఆ ఇంట్లోనే లభిస్తూ వుండడంతో సన్నగా రివటలా వుండే కొండల్రావు తెగ బలిసి గుండ్రాయిలా నున్నగా తయారైనాడు. ఐరావతమ్మకు గురువు, దైవం, ఆప్తుడు, ఆపద్బాంధవుడు అన్నీ అతనే. కొండల్రావు ఆ ఇల్లు తన స్వంతంగా భావిస్తే ఆమె కొండల్రావును తన యింట్లో ఒక సభ్యుడిగా పోషిస్తూ వుంది. అండవుంటే కొండ దాటవచ్చు అనే నమ్మకం ఆమెది. అందుకే అన్ని రహస్యాలు అతనికి చెబుతుంది.

కాలం సాగిపోయే ఎలక్ట్రిక్ ట్రెయిన్‌లా జారిపోతూ వుంది. ఐరావతమ్మ విసిగి వేసారిపోయింది. ఇక తాను లావు తగ్గటం ఈ జన్మకు కల్ల అనుకొంది. తన జన్మ ఇలా గడచిపోవాల్సిందే అనుకొన్నదై కొండల్రావుతో మాట్లాడడం తగ్గించి వేసింది. కొండల్రావుకు భయం పట్టుకొంది. పరిస్థితుల్ని అన్ని కోణాల్లోంచి పరిశీలించి చూశాడు. ఆమెకు తనమీద విశ్వాసం పోయింది. ఇక రెండురోజులు పోతే తనను హోటల్లో తినమన్నా ఆశ్చర్యపోనవసరంలేదు. తరువాత గదిలోంచి వెళ్ళగొట్టటం ఖాయం అనుకొన్నాడు. 'ఇంత బ్రతుకూ బ్రతికి ఇంటివెనకాల చచ్చినట్లు ఇది తనకు ఎంతఅవమానం!' మనసులోనే మధన పడసాగాడు కొండల్రావు.

రోజులు భారంగా గడుస్తున్నాయి ఇద్దరికీ. గోవిందయ్యకు ఇవేమీ పట్టవు. అడిగితే చిరాకు, అడగకపోతే పరాకు చూపిస్తున్నాడు. ఇలా భారంగా నడుస్తున్న

రోజుల్లో ఒకరోజు దగ్గర కాలం స్తంభించిపోయింది. పల్లెటూర్లో వున్న నాలుగెకరాల పొలంలో రెండెకరాలు అమ్మి బ్యాంకులో డిపాజిట్టు చేద్దామని అంతకుముందురోజే తెచ్చి బీరువాలో వుంచిన ఇరవైవేల రూపాయలు డబ్బు మాయమయ్యింది.

ఐరావతమ్మకు రోజూ నిద్రలేవగానే బీరువా తలుపు తెరిచి నగలను, డబ్బును కళ్ళకద్దుకోవడం అలవాటు. ఆ రోజు ఉదయం యథాప్రకారం నిద్రలేచివచ్చి కళ్ళు నులుముకుంటూ బీరువాతలుపు తెరిచింది. అందులో నగలున్నాయికాని, తను అంతకు ముందురోజు పెట్టిన డబ్బు మాయమయ్యింది. మళ్ళీమళ్ళీ కళ్ళు నులుముకొని చూసింది. బీరువా అంతా వెతికింది. అంతా శూన్యం. కళ్ళుతిరిగి క్రింద పడిపోయింది గోవిందయ్యా పరిచర్యలకు తెలివివచ్చిన ఆమె నెత్తీ నోరు కొట్టుకొంటూ ఏడ్చింది. వరండాలో కొచ్చిన గోవిందయ్యకు కొండల్రావు గది తలుపులు బార్లా తెరిచి వుండడం కనిపించింది. అందులో కొండల్రావు పెట్టె బట్టలూ, సంచీ వగైరా ఏమీలేవు గది శుభ్రంగా వుంది. ఇది కొండల్రావు చేసాడంటే నమ్మలేకపోయినా, అతడే చేసాడని తెరచిన గది తలుపులు తెలియచేస్తున్నాయి

మొదట కొండల్రావును నానా దుర్భాషలాడిన ఐరావతమ్మ తన అయోమయత్వానికి, తనకు సంభవించిన మోసానికి తనకు తనే నిందించుకొంది. నగలు అట్లాగే వున్నందుకు సంతోషించినా, ఇరవైవేల రూపాయలు రెక్కలొచ్చి ఎగిరిపోయినందుకు కడుపులో కెలికినట్లుగావుంది. పల్లెటూరి నుంచి రెండెకరాలమీద వచ్చే ధాన్యం పెట్టుకొని. బ్యాంకు డిపాజిట్‌లోంచి వచ్చే వడ్డీ పెట్టుకొని గుట్టుగా సంసారాన్ని గడుపుదామనుకొన్నారు ఐరావతమ్మ, గోవిందయ్య. ఇప్పుడు ఇది జరగడంతో అనుకొన్న మొత్తం బ్యాంకులో డిపాజిట్ చేయలేకపోయారు. కొండల్రావు పనిచేసే బట్టల షాపులో విచారిస్తే అతను అంతకు ముందురోజే తనకు రావలసిన డబ్బు తీసుకొని వెళ్ళిపోయాడని చెప్పారు గోవిందయ్యకు మొదటినుంచి కష్టపడి పనిచేయడం అలవాటులేదు కూర్చొని తినడం తప్ప. ఇప్పుడొచ్చే ఆదాయం చాలదు కనుక బ్రతుకు ఎలా గడపాలా అన్నది వాళ్ళకు సమస్య అయికూర్చొంది.

* * * *

ఇంటి వెనుకనున్న ఖాళీస్థలం చదునుచేసి అక్కడంతా కాయగూరలు వేసింది. ఇంటిముందు పూలచెట్ల స్థానంలో ఇప్పుడు రకరకాల పాదులు చేరాయి. ఐరావతమ్మ తన శ్రమనంతా వెచ్చించి కాయగూరలు పుష్కలంగా పండిస్తూ వుంది. ప్రతిరోజూ

వాటిని గంపలకెత్తి మార్కెట్టుకు వేస్తూవుంది. తిండికి ఇబ్బంది లేకుండా జరిగి పోతున్నా, అన్యాయంగా పోయిన ఇరవై వేలూ గుర్తుకొచ్చి ఓ మూల కూర్చొని ఏడుస్తుంది. అది ఆమెకు ఆరని కడుపుమంట. సంవత్సరాలు గడచిపోతున్నాయి.

ఆ రోజు ఐరావతమ్మ నాలుగు గంపల్లోనూ నాలుగురకాల కూరగాయలుసర్దింది. రిక్షావాడు ఒక్కొక్కటి తీసుకువెళ్ళి రిక్షాలో పెడుతున్నాడు. ఇంతలో పోస్టుమన్ ఐరావతమ్మకు ఒక కవరు అందించి వెళ్ళిపోయాడు. పనిలోవున్న ఐరావతమ్మ చదవ మని ఉత్తరం గోవిందయ్యకు అందించింది. గోవిందయ్య ఉత్తరం అమూలాగ్రం తన మనసులోనే చదువుకొని, "ఐరా! నీకు మంచిరోజులొచ్చాయి" అంటూ ఆమె కందించాడు. ఎందుకు గోవిందయ్య ముసిముసి నవ్వులు నవ్వుతున్నాడో ఆమెకు అర్ధం కావడంలేదు. ఉత్తరం చదవడం మొదలు పెట్టింది.

పూజ్యులు, గౌరవనీయులైన ఐరావతమ్మగారికి, గోవిందయ్యగారికి మీ విధే యుడు కొండవీటి కొండలావు వ్రాయునది-

నేను మీ ఇంట్లో మూడు సంవత్సరములు పున్నాను. ఆ కాలంలో ఉచిత భోజన నివాస సదుపాయములతో నన్ను ఎంతో ఆదరించారు. దానికి నా కృతజ్ఞ తలు తెలియజేసుకొంటున్నాను. కాని, పాపం మీ వ్యాధి నయం చేయించలేక పోయానే అని నాలో నేను ఎంతో మధనపడేవాడ్ని. ఎలాగయినా మీ వ్యాధినయం చేయించాలి అనే కృత నిశ్చయానికి వచ్చాను చివరికి. "నా సర్వస్వం త్యాగం చేస్తాను. వున్న డబ్బంతా ఖర్చుపెడతాను" అని మీరు చెప్పిన మాటలు పదేపదే గుర్తుకు వచ్చేవి. దానికి తగ్గట్లు మా ఓనరు నన్ను ఉద్యోగంలోంచి తీసివేయడంతో ఆ రాత్రంతా ఆలోచించి ఒక నిర్ణయానికి వచ్చాను. వేకువజామునే లేచి, బయట ఆదమరచి నిద్రపోతున్న మిమ్మల్ని గమనించాను. అంతే నా నిర్ణయాన్ని అమ లులో పెట్టదలచి దిండు క్రిందనున్న బీరువాతాళాలు తస్కరించి దొరికిన డబ్బుతో పారిపోయాను.

"....ఓరి దొంగ గాడిదా ఎంతప్లాను వేసావురా" పళ్ళు పటపట లాడించింది ఐరావతమ్మ.

అంతవరకు ఆపుకున్న కోపం మాటల రూపంలో బయటకు క్రక్కింది. రేడియో ప్రాంతీయ వార్తలంతా స్పష్టంగానూ, కాబూలీవాలా బాకీదారుడ్ని తిట్టినంత అసహ్యంగానూ కొండలావును తిట్టడం మొదలు పెట్టింది.

"ఐరా! పూర్తిగా చదివి, తరువాత తిట్టదలిస్తే తిట్టవే" అనునయంగా అన్నాడు గోవిందయ్య. మరలా ఉత్తరం చదవడం మొదలుపెట్టింది.

నాలుగు రోజుల క్రితం నేను వ్యాపారం నిమిత్తం ఈ ఊరికి వచ్చాను. మీరెలాగున్నారో చూద్దామని మీ ఇంటి కెదురుగా ఉన్న కిళ్ళీకొట్టు దగ్గర నిలబడ్డాను వరండాలో ఎవరో సన్నగా, రివటలా వున్న స్త్రీ చలాకీగా తిరుగుతూ కనిపించింది చివరకు ఆ సన్నగా ఉన్న స్త్రీ మీరేనని తెలుసుకొని చాల సంతోషించాను. మీరు పోయిన డబ్బు తలచుకొని కృంగి, కృశించి అలా తయారయ్యారని కూడ అర్థం చేసుకొన్నాను. ఎలాగైతేనేం, మీ జబ్బు నయం చేసేనన్న తృప్తి నాకుమిగిలింది మీకు ఆ పాపపు లావు తగ్గిపోయింది అయితే నా ఫీజు మీరు చెల్లించలేదు. కాని దానికి బదులు మీ దగ్గరనుంచి దొంగిలించి తెచ్చిన వడ్డీలేని అప్పు (నా దృష్టిలో) నాకెంతో ఉపకరించింది. నేను ఆ యిరవైవేలతో మా ఊర్లో చిన్న బట్టలకొట్టు పెట్టాను. ఈ ఆరేళ్ళలో ఆర్థికంగా నిలదొక్కుకున్నాను. నా భార్య బిడ్డలతో తృప్తిగా జీవిస్తున్నాను. ఇప్పుడు నా వ్యాపారం మీద పెట్టుబడి డెబ్బయివేలు మీ ఇరవైవేలు, దానికో అయిదువేలు జతచేసి మొత్తం ఇరవయి అయిదువేలకు రెండు రోజుల్లో బాంకు చెక్కు పంపుతున్నాను. నా అడ్రసు కోసం వాకబు చేయవద్దని మనవి.

గోవిందయ్యగారికి నా నమస్కారములు తెలియజేయండి.

ఇట్లు

కొండవీటి కొండలారావు

"ఎంతయినా కొండలరావు మనసే మనసండి. చేసింది దొంగతనమయినా ఎంత సమర్థతగా, ఎంత తెలివిగా తనమీద మాటరాకుండా చూసుకొన్నాడండి" అభిమానంగా అంది ఐరావతమ్మ. ఒకనాటి తన విపరీతమైన లావును, ఈనాటి సన్నని నాజూకయిన శరీరాన్ని తలచుకొని ఎంతో ఆనందించింది.

"అవునే. కొండలరావు తనమాట నిలబెట్టుకున్నాడు చివరకు" అన్నాడు గోవిందయ్య.

భర్త మాటకు సిగ్గుపడి తూనీగలా ఇంట్లోకి పరిగెత్తి ఐరావతమ్మ. రాబోయే చెక్కు గురించి ఊహిస్తూ ఆరోజంతా ఆనందంగా గడిపింది.

....